

# ఆఖరి మానవుడు


తాతినేని వెంకట
నరసింహారావు


"క్రాస్ కంట్రీ రేస్‌లో పరుగెడుతూ మీ అబ్బాయి గాయపడ్డాడని తెలియజెయ్యడానికి చింతిస్తున్నాము. స్పెషలిస్ట్‌చే ఎగ్జామిన్ చేయించగా సింపుల్ ఫ్రాక్చర్ అని ధ్రువపడింది. ఆదుర్దా పడవలసిన పని లేదు. నెల రోజులపాటు బెడ్ మీద ఉండాలి." సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పంపిన మెడికల్ రిపోర్టు సారాంశం.

ఆగరా బాదరాగా విజయనగరం చేరుకున్నాడు వెంకట్రావు. వేసవి కాలపు ఎండ మండిపోతోంది. సబ్–కలెక్టర్ ఆఫీసు ప్రాంతం అంతా నిర్మానుష్యంగా ఉంది.

బస్సుకోసం నిలబడ్డ వెంకట్రావుకి చికాగ్గా ఉంది. ఒకటికాదు... రెండు కాదు... మూడు బస్సులు ఖాళీ లేదంటూ నిర్లక్ష్యంగా దూసుకు పోయినవి.

దూరాన ఒక ఖాళీ రిక్షా కన బడింది. వెంకట్రావుకి ప్రాణం లేచి వచ్చింది. రిక్షా నెమ్మదిగా బరువుగా వస్తోంది.

"ఏయ్! రిక్షా!"

"బాబూ!"

"కోరుకొండ వస్తావా?"

"వచ్చేస్తామ, బాబూ."

"ఎంతిమ్మంటావ్? త్వరగా చెప్పు."

"మూడు రూపాయ లిప్పించండి."

"సరే, పద. తొందరగా తీసుకెడితే మరో రూపాయి ఇస్తా." వెంకట్రావు అవసరం అలాంటిది మరి.

మరో రూపాయితో ఆశ చూపించి రిక్షావాణ్ణి ఉత్సాహ పరిచినా వెంకట్రావుకి నమ్మకం కుదరలేదు. అయినా గత్యంతరం లేదు. వెంకట్రావు దృష్టిలో డబ్బుతో కాని పనులు బహు కొద్ది. ఆ కొద్దిలో ఇదొకటని సరి పెట్టుకున్నాడు. ప్లేన్‌లో వెళ్లి కొడుకుని చూడాలనుకున్న వెంకట్రావుకి చివరికి రిక్షా గతి అయింది.

వడగాలి గూబ గుయ్యి మనిపిస్తోంది. రిక్షా బరువుగా కదిలింది. వెంకట్రావు సిగరెట్ వెలిగించాడు. గంటన్నర ప్రయాణం సంగతి గుర్తు వచ్చి విసుక్కున్నాడు.

వెంకట్రావు రిక్షావాణ్ణి పరిశీలనగా చూశాడు.

రిక్షావాడి వయస్సు సుమారు అరవై లోపు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్టు రూపం. దారిద్ర్యానికి ప్రతినిధి.

**జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు కష్టాలు అనుభవించని మనిషి ఉండడం సాధ్యం కాదు. ఎప్పుడూ కష్టాలే అయితే అలవాటు కావచ్చు. కాని మనిషి క్రుంగిపోవడం తథ్యం. భరించడానికి శక్తి ఉండదు. భరించగలగాలంటే ఇతరులకు చెప్పకోవద్దంటారు విజ్ఞులు. కాని ఇతరులతో చెప్పకొని ఊరట పొందడానికే అందరూ యత్నిస్తారు. అయితే ఈ విషాద కథన నివేదనంలో ఒక చిక్కు ఉంది. సానుభూతి చూపకపోగా ఎదుటి వ్యక్తి తన గోడు చెప్పకొనడం ప్రారంభించవచ్చు.**

పుల్లల్లాంటి ఆ కాళ్లకూ, చేతులకూ రిక్షా తొక్కే సత్తువ ఎక్కణ్ణుంచి వస్తుందో వెంకట్రావుకి ఆశ్చర్యం వేసింది. ఎప్పుడో చూసిన నాటకంలో డైలాగులు గుర్తు వచ్చాయి.

'ఆకలి చెడ్డది. అయినా దరిద్రుడికి ఇంధనం లాంటిది.'

'అవసరం హంటర్ లాంటిది. ఝళిపించి దరిద్రుణ్ణి దౌడు తీయిస్తుంది.'

ఎండ వేడికి తారు కరిగి రిక్షా చక్రాలను పట్టేస్తూంది. రిక్షావాడు ముందుకు వంగి బలంకొద్దీ తొక్కుతున్నాడు.

వెంకట్రావుకి ఉప్పెనలా ఆలోచనలు ముంచుకు వచ్చినవి. 'అరవై ఏళ్ల ముసిలాడు మండుతున్న ఎండలో కండబలంతో వ్రిరవీగుతున్న తన కొంటె ముప్పయి అయిదేళ్ల వాణ్ణి మోయవలసి రావడం ఏం న్యాయం?

'జంతువుల్లో ఇది న్యాయం. బలహీనమైన వాటిని బలమైనవి చంపుకు తినడం జంతు న్యాయం. మనుష్యుల్లోనూ ఇంతేనా? మానవత్వం అని మనం చెప్పకునేది కూడా ఒక రకమైన రిఫైన్డ్ జంతు లక్షణం కాబోలు.'

వెంకట్రావుకి ఇలాంటి ఆలోచనలు రావడం ఏదో కొత్తగా ఉంది. ఈ రకం ఆలోచనలు అతని వ్యక్తిత్వానికీ, టెంపరమెంటుకీ పూర్తిగా వ్యతిరేకం. ఇంతలోనే మంచం మీద పడుకున్న తన కొడుకు మూలుగు వినిపించినట్లయింది. వెంకట్రావు హృదయం బాధతో మూలిగింది. తాను త్వరగా వెళ్లాలి.

"పోనీవోయ్ ... పోనీయ్..."గదమాయించాడు. రిక్షావాడు ఉలిక్కిపడి గబగబా తొక్కుతున్నాడు.

రెండుమైళ్ల దూరం వెనకబడింది. రిక్షావాడు రొప్పుతున్నాడు. దయ్యాలు కూడా సాహసించని ఎండలో రిక్షా తొక్కుతూ చెమటలు కక్కుతున్నాడు. ఆయాసపడుతూ ఒక చెట్టు నీడన ఆపాడు.

"ఉండండి, బాబూ! ఒక నిమసం కూకుంటేగాని సత్తువ రాదు." రిక్షావాడు నేలమీద చతికిలబడ్డాడు. వెంకట్రావుకి విసుగ్గా ఉంది.

"పొద్దుటినుంచీ గుక్కెడు మంచినీళ్లు తాగనేదు. బేరం ఒగ్గి బేరం. రిచ్చా దిగిందుకు ఈల్లేకపాయె." రిక్షావాడు గాలికి చెబుతున్నాడు.

వెంకట్రావుకి ముళ్ల మీద కూర్చున్నట్లుంది. తొందరగా వెళ్లాలనుకుంటే ఈ క్షోభేమి టితనకి?

"తాగందే రిచ్చ తొక్కలేను. రిచ్చా తొక్కప్పోతే తాగలేను. లంకమేతా గోదవరీతా, సరి."

వెంకట్రావుకి గొప్ప బోర్‌గా ఉంది.

"సరేలే, నీ సోద ఆపవోయ్! తొందరగా పోవాలి." వెంకట్రావు హెచ్చరించాడు.

వెంకట్రావు ఖచ్చితమైన నియమాలు గల మనిషి. ఉద్యోగంలో కిందివాళ్లనీ, సంఘంలో పేదవాళ్లనీ ఎప్పుడూ దూరంగానే ఉంచాలని అతని అభిప్రాయం. అందుకే తన సబార్డినేట్స్‌తో అతి క్లుప్తంగా మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు. కిందివాళ్లతో చనువుగా ఉంటే నెత్తినెక్కుతారని అతని నమ్మకం. అందుకే కొంచెం నిర్మొగమాటము, తెచ్చిపెట్టుకున్న గంభీరత అలవడ్డాయి.

ఉద్యోగరీత్యా పై లక్షణాలు అట్టే ప్రమాదమయినవి కావు. దురదృష్టమేమంటే ఉద్యోగంతోపాటు అలవరుచుకున్న కృత్రిమపు ఆడంబరాలు ఉద్యోగం పోయినా అంటిపెట్టుకునే ఉంటాయి.

ఉదాహరణకు రిక్షావాణ్ణి, వెంకట్రావుని తీసుకుందాం. వెంకట్రావు విజయవాడలో ఒక గవర్నమెంటు ఆఫీసరు. విజయనగరంలో ఒక రిక్షావాడితో నాలుగు ముక్కలు మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయా? అతని అంతస్తూ, హోదా తగ్గిపోతాయా? ఏవీ అవదు. భూమ్యాకాశాలు అలాగే ఉంటవి. నక్షత్రాలు మెరుస్తూనే ఉంటవి. ఏ లాటరీయో వస్తే తప్ప రిక్షావాడు రిక్షావాడే, వెంకట్రావు వెంకట్రావే! మరి అయితే ఎందు కింత వ్యత్యాసం? మనిషి, మనిషిగా ఉండలేడా?

రిక్షా బయలుదేరింది. వెంకట్రావుకి వినడం ఇష్టం లేకపోయినా రిక్షావాడు తన సోది చెప్పకుపోతున్నాడు.

"ఏటో? దేముడి మాయ సిత్రంగుంటది. నేకపోతే నా కీ జంజాటం ఏటో? ... జీయితంలో ఎన్నో సూసినా. కట్టంలో సుకం, సుకంలో కట్టం అన్నీ సూసినా ...

'ఒద్దే అన్నా. ఆడు మంచోడు గాదే అన్నా. నిన్ను నట్టేట్లో ముంచగలడే, ముండా!' అని ఎచ్చరించా. అయినా ఇంటదా? సెప్పా పెట్టకుండా సెక్కేసినాది. పోనీ, తప్పుడు పని చేసిందే అనుకుందము. ఆడితో తిన్నంగుందా? తగూ పెట్టుకునితంటా పడ్డది. మొగాడు మరో దాంతో పోటం తప్పా? సివరికి తన్ని తగిలేసినాడు.

'ఓంబ్బో! నీ మాట ఇనుకోక పోతినే' అంటూ గొల్లు మంటూ తిరిగొచ్చింది.

సివరకు మిగిలిందేటి? ...
తొమ్మిది నెల్ల కడుపు...
కన్నందుకు నాకు తప్పుతా దా?"

రిక్షావాడు చెప్పడం ఆపాడు. ఒక బస్సు దూసుకుంటూ వెళ్లిపోయింది. వినోద్దనుకున్నా రిక్షావాడి భాగోతం వెంకట్రావులో ఆసక్తి కలిగించింది. బూతుకబుర్లన్నా, రొమాన్సు మిళాయించిన హాట్‌కేక్స్ లాంటి కబుర్లన్నా వెంకట్రావు కిష్టం.

రిక్షావాడు చెమటలు కక్కుతున్నాడు. ప్రాణం బిగబట్టి తొక్కుతున్నాడు. వెంకట్రావుకి జాలివేసింది. కొంచెం దూరం దిగి నడిస్తే బాగుండుననిపించింది.

ఇంతలోనే కొడుకు గుర్తుకి వచ్చాడు. హాస్పిటల్లో బిక్కుబిక్కుమంటూ ఉంటాడు పిచ్చివెధవ! వాడి వయస్సెంత గనక? పన్నెండేళ్లు. ఆ వయసులో ఇంటివద్ద తల్లితో గారాబం చెయ్యవలసినవాడు... ఒంటరిగా బెడ్‌మీద... దీనంగా... బాధగా... వెంకట్రావు ఇక ఆలోచించలేకపోయాడు. ఎవరో గుండెల్ని పిండినట్లుగా ఉంది. తాను తొందరగా వెళ్లాలి ... తొందరగా ...



వెలుగు నీడలు ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

"పదవోయ్ ... పద ..." రిక్షావాణ్ణి గదమాయించాడు. ముసిలి ముండాకొడుకు దొరికినందుకు విసుక్కున్నాడు.

"సరే, బాబయ్యా!" అంటూ రిక్షావాడు కొంచెం జోరు పెంచాడు. మనిషి ఊగుతున్నాడు గాని రిక్షావేగం ఆట్టే పెరగలేదు. కొంచెంసేపు మౌనంగా నడిచింది రిక్షా. ముసిలాడు మాంచి పట్టులో ఉన్నట్టున్నాడు. మళ్లీ తన ధోరణిలోకి వచ్చాడు.

"కని పారేసి తన దారి తాను చూసుకుంది. నా కేటి దీ క్షోభ అనిపించింది. లంజకొడుకు పీక నులిమేద్దామని దగ్గిరపా వెళ్లినా...

యుద్ధం రంగంలో పన్జేసినా. నా సేతుల్తో ఎవర్నీ సంపనేదు గాని ఎన్నో పీనుగుల్ని మోసినా. సావంటే నాకు బయం నేదు. మనిసి సచ్చినా, కోడిపిల్ల సచ్చినా ఒకటేనా గుంటది నాకు. ఒక తూరి బాంబింగులో ఒకింటో అందరూ సచ్చిను. ఒకళ్ల తరవాత ఒకళ్ళు పది పీనుగుల్ని మోసినా. అప్పుడూ మనమ్మ సివుక్కుమనిపించలా. మామూలుగా ఈలేసుకుంటూ మోసేసినా. అసలు నేను మనిసినా అని అనుమానం గుండేది? నా గుండెకా యుండాల్సిన జాగాలో ఎండరా యుండుమనుకునే వాణ్ణి. అంత కర్కోటకుణ్ణి; పశువుని. అలాంటి నేను — సంపురాముని దగ్గిరపా ఎల్లిన నేను మనవణ్ణి సంపనేకపోయాను. స్వతంగాకపోతే మరేటి?

అప్పుణ్ణించి నేనూ మనిసినే అని పించినాది. నాకూ రకతం, మాంసం ఉన్నయ్యని తెలిసింది. గిల్లితే నాకూ నొప్పి అనిపించింది.

అదేం మరమమో? కళ్ళు తెరవని గుంటడు. నా మనసంతా ఆకట్టేసుకున్నాడు. రకతం తీపంటే ఇదే గామోసు...

ఆ వాడికోసమే ఈ వొయిసులో రిక్షా తొక్కటం మొదలుబెట్టినా. మరో ఎనిమిదేళ్ళు నా మీద పడ్డా సేవకు శక్తి తగ్గనేదు. ఆడికోసం ఇంకా పందేళ్ళు బతికుండాలని ఆశ...

భగమంతుడా, నా మనవడు పెద్దోడయ్యే వరకూ నా కాయుష్షివ్వు ..."

"పోనీవోయ్. వెధవగోలా... నా కర్మం కాలి నీ రిక్షా ఎక్కాను. నా కవతల తొందర పనుంది." వెంకట్రావు రిక్షా వాడి ధోరణికి అడ్డు వేశాడు.

"ఏటి, బాబూ, గొప్ప తొందర్లో పోతున్నరు? జోరుగానే తొక్కుతుంటిని గందా?"

"మా అబ్బాయికి దెబ్బ తగిలింది. తొందరగా చూడాలి." ఆప్రయత్నంగా వెంకట్రావు అనేశాడు.


"ఓస్...అంతేనా? దెబ్బలు కుర్రోళ్లగ్గాక పెద్దోళ్లకు తగుల్తవేటి?"

"మామూలు దెబ్బ కాదు. ఫ్రాక్చర్ ... ఫ్రాక్చర్ ..."

"అంటే?"

"దుమ్ము విరిగింది...దుమ్ము." విజయనగరం మాటను కావాలనే అన్నాడు.

"దాందేటేది, బాబూ? వారం రోజుల్లో అతుక్కుపోదూ? ... నా మనవడికి..."



నడ పడవలు

"నోర్ముయ్!" గట్టిగా అరిచాడు వెంకట్రావు. రిక్షావాడు కొంచెం కంగారుపడ్డాడు.

"ఏటి, బాబూ?"

"ఏమీ లేదు. ఆట్టే మాట్లాడక పోనీయ్." అకస్మాత్తుగా వచ్చిన కోపానికి కారణం రిక్షావాడి కర్థం కాలేదు.

కొడుకు గాయపడ్డాడని తెలిసిన వెంకట్రావు భార్యకి కూడా నిజం చెప్పకుండా బయలుదేరాడు. అసలే మనసు అల్లకల్లోలంగా ఉంది. ఎవరితోనైనా చెప్పుకుని వాళ్ల సానుభూతి పొంది ఉన్నట్లయితే కొంత ఉపశమనం కలిగి ఉండేది. అభిమానం కల వెంకట్రావు ఎవ్వరితోనూ చెప్పుకోలేదు. ఏదో యాథాలాపంగా రిక్షావాడితో అనేశాడు. అంతమాత్రానికే తన కొడుకు సంగతి చెబుతూంటే రిక్షావాడు తన మనవడి సంగ తెత్తుతాడూ? తన అంతస్తేమిటి? వాడి అంతస్తేమిటి? ఆ మాత్రం బుద్ధుండక్కర్లా? తన కొడుకుకి వాడి మనవడితో సామ్యం పెడతాడూ?

వెంకట్రావు ఈ రిక్షాలో ప్రయాణం చెయ్యవలసి వచ్చిన తన దురదృష్టాన్ని నిందించుకున్నాడు.

కొంచెంసేపు రిక్షా మౌనంగా నడిచింది. కాలానికి సంకెళ్ళు పడినట్టుగా ఉంది. గడియారం ముల్లు అతి కష్టం మీద కదులుతూంది. విసుగుతో వెంకట్రావు వెర్రెత్తిపోతున్నాడు.

ఉన్నట్టుండి రిక్షావాడు మళ్లీ మొదలుపెట్టాడు. భంగు త్రాగినవాడి మోస్తరుగా తెరలు తెరలుగా వెళ్లగక్కేస్తున్నాడు.

"తమరు కోపం తెచ్చుకోకండ, బాబూ." రిక్షావాడు క్షమాపణ చెప్పుకున్నాడు.

"నేను మాట్బాడక పోదునా? గుండె పగిలి ఛస్తాను. నా బాధ ఎవరికి చెప్పుకోను? తమరి కిష్టంనేకపోతే ఇనొద్దు, బాబూ. తమరిక్కాదు చెబుతోంట. ఆ సెట్లకు చెప్పుకుంటాను. ఆ పక్షులకు చెప్పుకుంటాను. పేణం ఉన్నవి నా గోల ఇనకపోతే నా రిక్షాకి చెప్పుకుంటా, బాబూ..."

రిక్షావాడి ధోరణి వెంకట్రావుకి అర్థం కాలేదు. మొదట్లో త్రాగుబోతు వాగుడని అనుకున్నాడు గాని, వాలకం చూస్తే అలా అనిపించడం లేదు. ఏదో షాక్‌లో ఉన్నట్టున్నాడు.

"నా మనవడికి మూడు రోజుల నించి స్ప్రుహ నేదు. అదేదో ఊరి మంట ...మారాజా ఆస్పత్రిలో పడేసినాను. అంతకంటే నేనేటి సెయ్యగల్ను? డబ్బు లేనోణ్ణి. సూసే దిక్కు నేదు..."

'ఈ ఇంజీసన్లు కొనిపట్రా — ఆలస్యం చెయ్యాక!' అని మందుచీటీ నా మొకాన కొట్టినాడు డాక్టరుబాబు. పాతిక రూపాయులు ... ఎక్కణ్ణించి తేను? నా ఒంట్లో సత్తువేసి ఉంటే దొంగతనం సేసయినా డబ్బు తెస్తును...ఛీ ... ఛీ ... ఎదవబతుకు! ముసిలి సంజకొడుకుని నాకు సావు రాదు. నా మనవడి సావు నేను సూడాల్నో ఏటో? ... అంతా తలకిందులు..."

రిక్షా ఆగిపోయింది. రిక్షావాడు ఆయాసంతో రొప్పుతున్నాడు.

"కూకోండి, బాబూ! మంచినీళ్ళు తాగొస్తా ..." రోడ్డు పక్కనున్న గుడిసె దగ్గరకు వెళ్ళి పిలిచాడు. జవాబు రాకపోవడంతో దగ్గరసా వేసి ఉన్న తడిక తలుపు తోసుకు లోనికి వెళ్ళాడు.

వెంకట్రావుకి విసుగ్గా ఉన్నా మంచినీళ్ళు తాగవద్దనేంత మానవత్వం లేని మనిషి గాడు. అయినా నడిచిపోతే మేలనిపించింది. ఎండ చూసి భయపడిపోయాడు. తన నిస్సహాయ స్థితిని నిందించుకుంటూ కూర్చుండిపోయాడు. క్లినిక్ స్కూల్ ఇంకా మూడు మైళ్ల దూరం.

ఒక బస్సు రయ్యుమంటూ విజయనగరం వైపు వెళ్లిపోయింది.

"తొందరగా రావోయ్. ఎంతసేపు తాగుతావ్?" వెంకట్రావు బిగ్గరగ పిలిచాడు. జవాబు లేదు.

మరో అయిదు నిమిషాలు గడిచాయి. మరోసారి పిలిచాడు.

జవాబు లేదు.

వెంకట్రావుకి విపరీతమైన కోపం వచ్చింది. రెండు తగల్నిద్దామని గుడిసెలోకి వెళ్ళాడు.

రిక్షావాడు చచ్చి పడి ఉన్నాడు.

"మై గాడ్!" అంటూ వెంకట్రావు తల పట్టుకున్నాడు. వెంకట్రావు మెదడు మొద్దుబారినట్టైనది.

'నా కెందుకీ సంత?' అనుకుంటూ ఎయిర్-బాగ్ పట్టుకుని గబగబా రోడ్డు వెంట వెళ్లిపోయాడు.

కొంతదూరం పోయాక పరిగెత్తాడు. ★